క్లుప్తంగా

చెస్ టోర్నీలో నగరి విద్యార్థిని ప్రతిభ


ట్రోఫీతో విద్యార్థి

నగరి: చెన్నై పొన్నేరి వేలమ్మాళ్ ఇంటర్నేషనల్ స్కూల్ నాలుగు రోజులపాటు నిర్వహించిన రేటింగ్ చెస్ టోర్నమెంట్ అండర్–15 కేటగిరీలో మండలంలోని ముడిపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం నవ్యశ్రీ సత్తా చాటింది. 5వ స్థానంలో నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. కృషి, పట్టుదలతో చెస్‌లో రాణించిన విద్యార్థిని, కోచ్ ఆనంద్‌మోహన్‌ను హెచ్‌ఎం మురళీకృష్ణ అభినందించారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కార్వేటినగరం: కార్వేటినగరంలో వెలసిన శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం జరుగుతుందని టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆలయ అధికారి మాట్లాడుతూ ఏటా జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో నిర్వహించే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని వేద పండితుల నడుమ సుగంధ ద్రవ్యాలతో ఆలయ శుద్ధి కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని సూచించారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ


సతీష్

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు ఎంపీడీఓగా సతీష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నగరిలో పరిపాలనాధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ఆయన ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న హరిప్రసాద్ రెడ్డి విజయపురానికి పదోన్నతిపై వెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచులు మునిరాజారెడ్డి, ఎంపీటీసీలు భారతి, హనీఫ్ బాషా, కేశవులు, ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది ఎంపీడీఓను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేసినారు.

గంగమ్మ కొలుపు


గుడి వద్ద రంగులతో వేసి ముగ్గు

నిండ్ర: స్థానిక యాదవ వీధిలో సోమవారం గంగమ్మ కొలుపు నిర్వహించారు. రెండు రోజులు నిర్వహించే కొలుపులో తొలిరోజు గంగమ్మ గుడి వద్ద రంగులతో గంగమ్మ చిత్రం, ముగ్గులు వేశారు. అనంతరం గెరిగను గ్రామంలో ఊరేగించారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

గంగాధరేశ్వర స్వామికి పూజలు



గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని గంగాధరేశ్వర స్వామికి చిత్రపౌర్ణమి సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు బాలాజీ స్వామి ఆధ్వర్యంలో గంగాధరేశ్వర స్వామికి వేదమంత్రోచ్చరణల నడుమ మేళతాళాలతో అభిషేక పూజలు చేపట్టారు. కలవకుంట సుబ్రమణ్యం శెట్టి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జాతరకు సిద్ధమైన గంగమ్మ



పుత్తూరులో ముస్తాబైన గంగమ్మ

పుత్తూరు: పట్టణంలోని పిడికిలి గంగమ్మ తిరుపతి జాతరకు ముస్తాబైంది. సోమవారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మంగళవారం తిరుపతి జాతరను పురస్కరించుకుని స్థానిక బజారువీధిలోని పిడికిలి గంగమ్మను కొలవడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. పట్టణ ప్రజలతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు సైతం తిరుపతి జాతర సందర్భంగా పుత్తూరు గంగమ్మను దర్శించుకోవడం ఇక్కడి విశేషం. ఇందుకు తగ్గట్లు గంగమ్మ ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది.

పిచ్చిమొక్కల తొలగింపు

నిండ్ర: మండలంలోని వివిధ గ్రామ పంచాయితీల్లో సోమవారం పారిశుధ్యం మెరుగు పరిచారు. మురుగు కాలువలు శుభ్రం చేశారు. రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాబురెడ్డి పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం



ఎక్కువ మంది ఆఫీసు, ఇల్లు, పిల్లలు, బాధ్యతలు అంటూ ఆరోగ్యం గురించి పట్టించుకోరు. పరుగులమయమైన జీవితంలో కొందరు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. అయితే జిమ్‌లకు వెళ్లే పనిలేకుండా, రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యం ఉండటానికి ఏదైనా ఉందీ అంటే అది నడక మాత్రమే. కరోనా మహమ్మారి ప్రజలకు ఎన్నో పాఠాలు నేర్పింది. ఎంత ఆస్తిపరులైనా ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదనే భావన ప్రజల్లో ఇప్పుడు బలంగా నాటుకుంది. దీనికి దారితీసిన కారణాలు పక్కన బెడితే, రోజూ ఓ గంట నడిస్తే ఆరోగ్యానికి మేలని వైద్యులు సైతం సెలవిస్తున్నారు. మరోవైపు నగరంలో వాకర్ల సంఖ్య కూడా పెరగడం చూస్తే ఆరోగ్యానికి వారు ఇస్తున్న ప్రాధాన్యత తెలుస్తోంది.

- కండరాలు, ఎముకలకు బలం
- దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ
- రోజూ ఓ గంట నడిస్తే మేలంటున్న వైద్యులు

విజయపురం: నగరం, పట్టణ, మండలంలో వాకర్ల సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరుగుతోంది. ఎవరికి వారు వారి పరిధిలో ఉన్న మైదానాలు, పార్కుల్లో, ఖాళీ స్థలాల్లో వాకింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం కళాశాల, పాఠశాల మైదానం, రోడ్డుపై వాకర్లు ఎక్కువగా కనిపిస్తున్నారు. ఇప్పుడు చాలా మంది వాకింగ్ చేయనిదే ఏ పనీ చేయడం లేదు. చాలా మంది సీనియర్ సిటిజన్లు ఆరోగ్యంగా ఉన్నారంటే కారణం దానికి వాకింగేనని వైద్యులు చెప్పే మాట.

ఉదయం చేస్తే మంచిది

ఉదయం పూట వాకింగ్ చేస్తే మంచిది. ఈ సమయంలో సూర్యకిరణాలు శరీరానికి విటమిన్–డి అందేలా చేస్తాయి. ఉదయన్నే నిద్రలేవడం వల్ల జీవక్రియల వ్యవస్థ బాగా పని చేస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీనికితోడు ఉదయాన్నే నీళ్ల ఎక్కువగా తాగడం వల్ల శరీరంలోని కొవ్వులు, కేలరీలు అధికంగా కరిగి బరువు తగ్గుతారు.

వాకింగ్ ఎలా చేయాలి

- వాకింగ్ చేసేందుకు ముందు ఐదు నుంచి పది నిమిషాలు వార్మప్ చేయాలి. నిటారుగా నిలబడి నడవటం వల్ల ఎక్కువ దూరం నడిచినా అలసట ఉండదు. చేతులు ముందుకూ వెనుకకూ కదుపుతూ నడవాలి.
- నడిచేటప్పుడు పాదం మొత్తం నేలకు తాకేలా చూసుకోవాలి.
- ప్రారంభంలో నెమ్మదిగా నడిస్తేనే మంచిది.
- రోజూ 10 నిమిషాలు పెంచుకుంటూ చివరగా గంట వరకూ నడిచేలా చూసుకుంటే మంచిది.
- ఇలా నడవటం వల్ల శరీరంలో అనవసర కొవ్వు చమట రూపంలో బయటకు వస్తుంది.
- బయటకు వెళ్లటానికి వీలులేనప్పుడు.. ఇంటి డాబా పైన, కారిడార్లో వాకింగ్ చేసినా మంచిదే.
- వీలుంటే పార్క్ వంటి పచ్చని ప్రదేశాలు వాకింగ్ ఇంకా మంచింది.

8 ఏళ్లుగా వాకింగ్ చేస్తున్నా



నేను ఏళ్ల నుంచి వాకింగ్ చేస్తున్నా. రోజూ ఉదయం పార్కులో వాకింగ్ వెళ్తుంటాను. అరగంట నుంచి ముప్పావు గంట వరకు వాకింగ్ చేస్తాను. దీనివల్ల నేను ఆరోగ్యంగా ఉంటున్నాను. ఒక్క రోజు వాకింగ్ చేయకపోతే ఏదో కోల్పోయినట్లు ఉంటుంది. వాకింగ్ నా దినచర్యలో భాగం.

–విజయప్రకాష్, నగరి

నేను రోజూ జాగింగ్ చేస్తా



నేను కొన్నేళ్లుగా వాకింగ్‌తో పాటు జాగింగ్ చేస్తున్నా. దీనివల్ల ఫిట్‌నెస్‌తో చురుగ్గా ఉంటున్నా. ఎంత పనిచేసినా శరీరానికి అలసట రానివ్వదు. మనసు కూడా ఉల్లాసంగా ఉంటుంది. ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యం కోసం వాకింగ్ చేయాలి.

–జ్ఞానకుమార్, పీఈటీ, విజయపురం

ఎముకలు, కండరాలు బలంగా ఉంటాయి



ప్రతిరోజూ వాకింగ్ చేయడం వల్ల రోగాలు దరిచేరవు. ఎముకలు, కండరాలు గట్టి పడుతాయి. వాకింగ్ చేయడం వల్ల రక్త సరఫరా వ్యవస్థ మెరుగు పడుతుంది. భవిష్యత్తులో వెన్నెముక, నడుమునొప్పి వంటి సమస్యలు కూడా రావు. శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

–డాక్టర్ రవిరాజు, ఇంటర్ నేషనల్ వాకింగ్ ప్రెసిడెంట్

నోటీస్ బోర్డు

ఆయిల్ పామ్‌పై అవగాహన సదస్సు రేపు

విజయపురం: మండలంలోనే కోసలనగరం రైతు సేవా కేంద్రంలో ఆయిల్ పామ్ పంటపై బుధవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు ఉద్యానవన శాఖ అధికారి లోకేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోసలనగరం చుట్టు పక్కల గ్రామ రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వారాహి శక్తి పీఠంలో ప్రత్యేక పూజలు



పుత్తూరు: చిత్రా పౌర్ణమి పురస్కరించుకుని పరమేశ్వరమంగళం గ్రామ సమీపాన నగరి కనంమిట్ట వద్ద ఉన్న దక్షిణ కాళీ వారాహి శక్తిపీఠంలో సోమవారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కాళీమాతా, వారాహి అలంకరణలతో విశేషంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ఇక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం పరిపాటి.

టీడీపీ నేత చెప్పాడు.. పనులు ఆపేయండి

- గంగాధరనెల్లూరు మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శి ఓవర్ యాక్షన్
- కాలువ నిర్మాణానికి టీడీపీ నేత అనుమతి కావాలని సలహా
- గ్రామస్తుల అవసరం మేరకు కాలువ పనులు చేయిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ
- ప్రజాప్రతినిధుల అధికారాలను కాలరాసేలా వ్యవహరిస్తున్న వైనం


అర్ధాంతరంగా నిలిచిపోయిన కాలువ నిర్మాణ పనులు

గంగాధర నెల్లూరు: తెలుగుదేశం పార్టీ నాయకుల అనుమతులు ఉంటేనే గ్రామంలో అభివృద్ధి పనులు, కాలువ నిర్మాణ పనులు చేపట్టాలని ఓ పంచాయతీ కార్యదర్శి హుకూం జారీ చేస్తున్నాడు. గంగాధర నెల్లూరు మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఓం శక్తి ఆలయానికి అనుబంధంగా గ్రామస్తులు సర్పంచ్, ఎంపీటీసీ ఆధ్వర్యంలో కాలువ నిర్మాణ పనులు చేపట్టగా.. ఓ టీడీపీ నాయకుడు అధికారం ఉందనే అహంకారంతో పనులు నిలిపి వేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించాడు. దీంతో సదరు కార్యదర్శి గ్రామస్తులు చేపడుతున్న కాలువ నిర్మాణ పనులను అర్ధాంతరంగా నిలిపేయాలంటూ సర్పంచ్, ఎంపీటీసీలకు ఫోన్ చేసి చెప్పాడు. దీనిపై గ్రామస్తులు మాట్లాడుతూ అభివృద్ధి పనులను టీడీపీ నాయకుడు చెప్తే పంచాయతీ కార్యదర్శి నిలిపివేయడం ఏంటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రతి అభివృద్ధి పనికి ఆటంకాలు కలిగిస్తున్నారని మండిపడ్డారు. సర్పంచ్ చేపట్టిన పనులను పంచాయతీ కార్యదర్శి ఒక కూటమి నాయకుడు చెప్పాడని నిలిపివేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే అన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్ అధికారాలను కాల రాయడమే అని మండిపడ్డారు.

పొలిటికల్ ప్రెజర్ ఉందంటూ..

సదరు సమస్యపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా పొలిటికల్ ప్రెజర్ ఉందని, సదరు టీడీపీ నాయకుడితో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని, ఆ తర్వాత గ్రామసభ తీర్మానం పనులు చేసుకోవచ్చన్నాడు. త్వరలో గ్రామసభ పెట్టి తీర్మానంపై మెజారిటీ సభ్యుల తీర్మానం మేరకు పనులు చేపట్టుకోవచ్చని, ప్రస్తుతం అయితే పనులు నిలిపివేయాలని తెలిపారు.

మాజీ మంత్రి రజినితో పోలీసుల తీరు జుగుప్సాకరం


ఈజీ బాబు

నగరి: రాష్ట్ర మంత్రిగా పని చేసిన విడుదల రజినిపై పోలీసుల ప్రవర్తన అనుచితం, రాజ్యాంగ విరుద్ధమని నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు ఇజి. బాబు ఖండించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు ఆమెతో ప్రవర్తించిన తీరు జుగుప్సాకరంగా ఉందని, చిలకలూరిపేట సీఐ సుబ్బానాయుడు ఆమెతో అనుచితంగా ప్రవర్తించడమే కాక కేసులు నమోదుచేస్తానని ఆమెను బెదిరించడం చూస్తుంటే మహిళల రక్షణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సీఐపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అతనిపై న్యాయపరమైన పోరాటం చేస్తామన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం పనులు చేయించండి

నిండ్ర: గ్రామాల్లో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి పారిశుధ్యం పనులను క్రమం తప్పకుండా చేయించాలని ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంక్‌లో నీటిని నింపిన ప్రతిసారీ క్లోరినేషన్ చేసి నీరు సరఫరా చేయాలన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలు ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా


రైల్వేగేట్ వేయడంతో గ్రావెల్ లోడుతో నిలిచి ఉన్న ట్రాక్టర్లు

పుత్తూరు: పట్టణ పరిధిలోని మరాఠిగేట్ గుట్ట నుంచి ప్రతి రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా గ్రావెల్ అక్రమ రవాణా సాగుతోంది. పుత్తూరు మండలం నందిమంగళం రెవెన్యూ లెక్క దాఖలాలోని సర్వే నంబర్ 199లో పూరా విస్తీర్ణం 597.81 ఎకరాలు ఉండగా, ఇందులోనే మరాఠిగేట్ గుట్ట, ఎన్జీఓ కాలనీ, ఎన్టీఆర్ కాలనీలతో పాటు, కోనేటిపాళెం గుట్టలు సైతం విస్తరించి ఉన్నాయి. మరాఠిగేట్ గుట్ట నుంచి కొన్ని నెలలుగా మట్టిని తరలిస్తూ అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. గుట్టను తవ్వేస్తున్నారంటూ స్థానికులు అడ్డుకుంటే వారిపై అక్రమార్కులు తిరగబడుతున్నారు, దౌర్జన్యం చేస్తున్నారు. విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులైనా అక్రమ గ్రావెల్ రవాణాకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ


జీడీ నెల్లూరు పీహెచ్‌సీలో తనిఖీ చేస్తున్న డాక్టర్ హనుమంతరావు

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం చిత్తూరు జిల్లా వ్యాధి నిరోధక అధికారి డాక్టర్ హనుమంతరావు ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు అందించారు. పీహెచ్‌సీలో చికిత్స కోసం వచ్చే రోగాలు వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులో 100 శాతం నిర్వహించాలని తెలిపారు. ఎన్‌సీడీ కార్యక్రమంలో తప్పనిసరిగా చిత్తూరు గవర్నమెంట్ హాస్పిటల్‌కు పంపించి సదరు యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఫార్మసిస్టు నాగలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న లక్ష్మీప్రసన్న

పెనుమూరు(కార్వేటినగరం): రైతులకు సాంకేతిక పరి/జ్ఞానంపై అవగాహన ఎంతో అవసరమని జిల్లా వనరుల కేంద్రం ఇన్‌చార్జ్ లక్ష్మీప్రసన్న అన్నారు. సోమవారం పెనుమూరు మండల పరిధిలోని సాతంబాకం గ్రామంలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులకు డిజిటల్ పరిజ్ఞానంపై అవగాహన ఉంటే మార్కెట్ ధరలు, వాతావరణంలో మార్పులు, డిజిటల్ చెల్లింపులను సులభంగా చేసుకోవచ్చన్నారు. ట్రైనింగ్ కోఆర్డినేటర్ సంధ్యం, రైతుసేవా కేంద్రం ఇన్‌చార్జ్ వినయ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం


చెక్‌ను అందజేస్తున్న వెంకట్రామయ్య

పుత్తూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని ఆర్థో స్పెషలిస్ట్ డాక్టర్ రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సమావేశం ప్రెసిడెంట్ గుణశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. తొలుత యుద్ధంలో దేశం కోసం వీరమరణం పొందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం ముఖ్య అతిథిగా డాక్టర్ రాజేష్ మాట్లాడారు. అనంతరం న్యాయ శాఖ విశ్రాంత ఉద్యోగి వి.వెంకట్రామయ్య విశ్రాంత భవన అభివృద్ధికి రూ.50 వేల విరాళ చెక్కును గుణశేఖర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రామచంద్రరాజు, యుగంధర్‌రాజు, రవిశంకర్, వెంకట కృష్ణనాయుడు, బాలసుబ్రమణ్యం, అరుణాచలం, నిర్మలమ్మ, శంకరయ్య, రామలింగం, మార్టిన్, రాధాకృష్ణ, రమేష్, కుప్పయ్య పాల్గొన్నారు.

అగ్నిగుండ ప్రవేశం



పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురంలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. ధర్మరాజుకు పట్టాభిషేకం చేసి ద్రౌపదీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. మధ్యాహ్నం మహిళలు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం ద్రౌపదీ అమ్మవారి ఎదుట కంకణం కట్టుకున్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి, పూల గెరిగెకు మహిళలు మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా ముత్తి గంగమ్మ జాతర


ముత్తి గంగమ్మకు ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిధిలోని ఉగ్రాణంపల్లిలో వెలసిన ముత్తిగంగమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. సోమవారం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ఊంజల్‌సేవతో జాతర ప్రారంభమైందన్నారు. 13వ తేదీ మంగళవారం ఉదయం 6 గంటలకు జాతర చాటింపు, 9 గంటలకు సత్యమ్మకు అంబలి కార్యక్రమం, మధ్యాహ్నం 2 గంటలకు అక్కగార్లకు పూజా కార్యక్రమం, సాయంత్రం అమ్మవారికి మహిళలు పొంగళ్లు వండి పిండిదీపాలు వెలిగించి నైవేద్యం సమర్పిస్తారని తెలిపారు. రాత్రి ప్రత్యేక వాయిద్యాల నడుమ అమ్మవారి గెరిగె ఊరేగింపు ఉంటుందన్నారు. 14వ తేదీ బుధవారం గ్రామంలో వెలసిన ఆరిమాని గంగమ్మను వేకువ జామున ఏనుగులు, గుర్రాలతో పాటు మేళతాళాల నడుమ ఊరేగించడం జరుగుతుందన్నారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారి నిమజ్జనంతో జాతర ముగుస్తుందని, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రజల వినతులపై దృష్టి పెట్టండి

శ్రీరంగరాజపురం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులపై రెవెన్యూ సిబ్బంది దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 14 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 05, శ్మశానానికి దారి 01, భూసర్వే 02, ఇంటి నిర్మాణానికి పొజిషన్‌పట్టా మంజూరు చేయాలని 01, పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని 02, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులను చూపించాలని 03 వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందే ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

అందుబాటులో ట్రాన్స్‌ఫార్మర్లు

కార్వేటినగరం: రైతులకు అందుబాటులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండేలా ఏర్పాటు చేస్తున్నామని విద్యుత్ డీఈ సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఏడీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం తిరుపతికి వెళ్లాల్సి ఉండేదని, జిల్లాల విభజన అనంతరం జీడీనెల్లూరు నియోజకవర్గానికి అన్నూరు సబ్‌స్టేషన్ ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు.

డైయింగ్ యూనిట్లు తరలించండి

- ఇప్పటికే కలుషితమైన భూగర్భ జలాలు
- నీటిలో టీడీఎస్ 1500 పైచిలుకే
- ఆలస్యం చేస్తే నగరి మరో ఉద్దానం
- కలెక్టర్‌కు నివేదించిన మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజా సంఘాల నాయకులు


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్లు, ప్రజా సంఘాల నేతలు

నగరి: ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్న డైయింగ్ ఫ్యాక్టరీలను ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకంటూ కేటాయించిన స్థలాలకు తరలించాలని, అప్పటివరకు వాటిని మూసి ఉంచాలని మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాసంఘాల నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, మున్సిపల్ పరిధిలోని డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే హానికర రసాయన నీటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరి మున్సిపల్ పరిధిలో సుమారు 60వేల మంది జనాభా ఉండగా సుమారు 30 వేల మందికిపైగా వివిధ రుగ్మతలతో బాధ పడుతున్నారన్నారు. ఈ సమస్యపై తాము పోరాటం చేస్తే మున్సిపల్ అధికారులు ప్రతి డైయింగ్ యూనిట్లను తనిఖీ చేసి ఏదీ సక్రమంగా జరగడం లేదని మూసివేయించారన్నారు. అయితే వీటిలో 6 డైయింగ్ యూనిట్లను ఉన్నతాధికారుల ఆదేశాలున్నాయంటూ మళ్లీ తెరిచారని, వాటిని తెరచిన రోజు నుంచి కాలువల్లో హానికర రసాయనాలు ఏరులై పారుతోందన్నారు. ప్రస్తుతం నగరి నేత పరిశ్రమ వారికి గతంలో ఉన్నంత పనులు లేవన్నారు. పలువురు నేత కార్మికులు కూలీ పనులకు వెళుతున్నారన్నారు. అయితే ఇన్ని డైయింగ్ యూనిట్లు ఎవరికోసం పని చేస్తున్నాయన్నారు. మద్రాసు హైకోర్టు 2011 జనవరిలో తిరుపూర్‌లో నిషేధించిన డైయింగ్ యూనిట్లు స్థానిక ముసుగులో నగరికి చేరి పట్టణాన్ని సర్వనాశనం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీటిలో 50–150మి.గ్రా/లీ ఉండాల్సిన టీడీఎస్ (టోటల్ డిసాల్వ్‌డ్ సాల్వెంట్) ఒక ప్రాంతంలో 1000, మరొక ప్రాంతంలో 1500 అంటూ చూపుతుండటం చూస్తే ఎంతటి హానికరమే ఇట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ నీటిని తాగడానికి కాదు కదా స్నానానికి వాడినా హానికరమే అని వైద్యులు హెచ్చరించారని, ఇంతటి హానితో నగరి మరో ఉద్దానంలా మారక మునుపే ప్రజా సంక్షేమాన్ని ఎంచి మిషన్, మాన్యువల్ డైయింగ్ యూనిట్లను నివాస ప్రాంతాలకు దూరంగా ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న తరాలవారైనా నగరిలో మంచినీటిని ఇవ్వాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలన్, దళిత్ పీపుల్స్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు గజేంద్ర, కౌన్సిలర్లు దయానిధి, బీడీ భాస్కర్, ఇంద్రయ్య, గోపాల్‌రెడ్డి, మోహన్‌రాజ్, భూపాలన్, బిలాల్, ప్రజా సంఘాల నాయకులు మునికృష్ణారెడ్డి, ఆనంద్‌కుమార్, ఎల్లప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.